ప్రజాశక్తి

గురువారం 19 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పేదోళ్లకు చేదోడు ఏదీ?

- దత్తతకు ముందుకురాని సంపన్నులు
- ప్రహసనంగా పి4
- సర్వేకే పరిమితం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో పేదలకు తోడుగా నిలబడే మార్గదర్శకుల కోసం ప్రభుత్వ యంత్రాంగం అన్వేషిస్తోంది. పేదరికంపై యుద్ధం పేరుతో ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్, ప్రయివేటు, పీపుల్ పార్టనర్‌షిప్ (పి4) కార్యక్రమం ప్రహసనంగా తయారైంది. పేదలకు చేయూత అందించడం ద్వారా 2047 నాటికి పేదరికంలేని రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని ప్రభుత్వ భావించింది. కానీ, పి4తో పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాల పెంపు సాధ్యమయ్యే పరిస్థితులు కన్పించడంలేదు. జిల్లాలోని 24 మండలాల్లో 4.53 లక్షల కుటుంబాలు, 18 లక్షల జనాభా ఉన్నట్లు అంచనా. ఇందులో అనకాపల్లి, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావ ుపేట, పెందుర్తి, యలమంచిలి నియోజకవర్గాల్లో నిర్వహించిన సర్వేలో 64,518 కుటుంబాల్లోని 1.69 లక్షల మంది సాయానికి అర్హులుగా గుర్తించారు. తొలుత 17,736 కుటుంబాలను సంపన్నులు దత్తత తీసుకొని సాయంచేసేలా అధికారులు సమన్వయం చేయడానికి ప్రయత్నించారు. సాయం చేయడానికి 2092 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. 46,782 కుటుంబాలకు సాయం చేయడానికి ఇంతవరకు ఎవరూ రాలేదు.

సాయానికి అర్హులైన పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగానూ, సాయం చేసే సంపన్నులను మార్గదర్శకులుగానూ ప్రభుత్వం పిలుస్తోంది. ప్రభుత్వ ఒత్తిడితో కొంతమంది పేర్లను నమోదుచేసినప్పటికీ, నమోదుచేసుకున్నవారు పేదలకు సాయం చేసేందుకు ఆసక్తి చూపడంలేదు. కూటమికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పేదలకు తోడుగా నిలబడ్డానికి ముందుకురాని పరిస్థితి

మిగతా 2లో..

జిల్లాలో పి4కు అర్హులైన పేద కుటుంబాలు, దత్తత తీసుకున్న వారి వివరాలు

నియోజకవర్గం	పేదకుటుంబాలు	దత్తతదారులు
అనకాపల్లి	862	165
చోడవరం	10,916	276
మాడుగుల	10,770	618
నర్సీపట్నం	9,386	408
పాయకరావుపేట	13,584	69
పెందుర్తి	3,808	130
యలమంచిలి	7,382	429

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

యోగా ఒక గ్లోబల్ ఈవెంట్

ప్రపంచ స్థాయికి విశాఖ ప్రతిష్ట
జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని, యోగా ఒక గ్లోబల్ ఈవెంట్ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని దసపల్లా హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యోగా మన సాంప్రదాయానికి ప్రతిరూపం మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరి ఆరోగ్య జీవనశైలిలో భాగమని, 25 రోజులుగా నగరవ్యాప్తంగా విశాల ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 10 యోగా దినోత్సవాలు ఘనంగా నిర్వహించామని, 11వ యోగా దినోత్సవాన్ని విశాఖలో జరపడం రాష్ట్రానికి గౌరవం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ యోగాసనాల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రపంచ వ్యాప్తంగా 175 మంది ప్రతినిధులు...

ప్రపంచవ్యాప్తంగా 175 దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని మంత్రి తెలిపారు. విశాఖ బీచ్‌లో ఆలయం నుంచి బీచ్ వరకు యోగా ప్రదర్శన ఉంటుందన్నారు. 5 లక్షల మంది పాల్గొననున్న యోగా కార్యక్రమం ద్వారా

మిగతా 2లో..

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి

▶ వార్త మెయిన్‌లో..

భారత నావికాదళంలోకి ఐఎన్ఎస్ అర్నాల యుద్ధనౌక

▶ వార్త మెయిన్‌లో..

విశాఖ విమల విద్యాలయాన్ని పున:ప్రారంభించాలి

▶ వార్త మెయిన్‌లో..

పలు రైళ్లకు కోచ్‌ల పెంపు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి పలు రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లలను పెంచాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 07027/07028 చర్లపల్లి-బ్రహ్మపూర్-చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 13 నుంచి, బ్రహ్మపూర్ నుంచి బయలుదేరే ట్రైన్‌కు ఈ నెల 14వ తేదీ నుంచి శాశ్వత ప్రాతిపదికన ఒక 3వ ఏసీ కోచ్‌ను పెంచనున్నారు. 17243/17244 గుంటూరు-రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 18వ తేదీ నుంచి గుంటూరులో, ఈ నెల 19వ తేదీ నుండి రాయగడ లో బయలుదేరే రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన రెండు స్లీపర్ క్లాస్, ఒక 3వ ఏసీ కోచ్‌లను జతచేయనున్నారు.

20, 21న తీరంలో చేపల వేట వద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

విశాఖపట్నం తీర ప్రాంతంలో ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి, పలువరు ప్రముఖులతో పాటు లక్షలాది మంది ప్రజలు హాజరు కానున్నందున తీర ప్రాంత రక్షణ దృష్ట్యా ఈనెల 20, 21 తేదీలలో ఫిషింగ్ హార్బర్ నుండి భీమిలి వరకు గల తీర జలాలలో చేపల వేట నిలుపుదల చేసి సహకరించాలని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదలచేసింది. తీర పోలీస్ శాఖ కోరినందున ఆ రెండు రోజులు భీమిలి - ఫిషింగ్ హార్బర్ మధ్య తీర జలాలలో చేపల వేట నిలుపుదల చేయాలని కోరింది.

జాతీయ రహదారిలో రెండు వైపులా బారులు తీరిన వాహనాలు

యోగాంధ్రతో ట్రాఫిక్ కష్టాలు

నగర పరిధిలో సుమారు 5 కిలోమీటర్లకు పైగా ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నం బీచ్ రోడ్డులో సుమారు 25 కిలోమీటర్ల మేర నిర్వహించనున్న యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం నుంచి బీచ్ రోడ్డు పూర్తిగా మూసివేయడంతో విశాఖపట్నం ప్రజలకు ఎన్నడూ లేని విధంగా ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో విశాఖపట్నంలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లోనూ ట్రాఫిక్ సుమారుగా మూడు నుండి ఐదు కిలోమీటర్ల మేర స్తంభించిపోయింది. పలు ప్రాంతాల్లో అంబులెన్సులు, అత్యవసర వాహనాలు, కళాశాలల బస్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర అవస్థల పాలయ్యారు. భీమిలి బీచ్ రోడ్డు నుండి ఆర్‌కె బీచ్ వరకు పూర్తిగా బీచ్ రోడ్డును మూసివేశారు. ఆ రహదారిలో ప్రయాణించే ట్రాఫిక్‌ను ఎన్ హెచ్ - 5 మీదికి మళ్లించడంతో అటు శ్రీకాకుళం నుండి వచ్చే వాహనాలు ఇటు పెందుర్తి , సింహాచలం నుండి వచ్చే వాహనాలు ఒక్కసారిగా హనుమంతవాక కూడలికి చేరుకొని సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ నెలకొంది. విశాఖ నగరంలోని అప్పుఘర్ పార్కు నుండి పార్క్ హోటల్ జంక్షన్ వరకు ఉదయం, సాయంత్రం సమయాల్లో తీవ్రమైన రద్దీ ఉంటుంది. ఈ

మిగతా 2లో..

ముందస్తు ప్రణాళిక లేదు

ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళికలు రచించకుండా గతంలో క్రికెట్ మ్యాచ్‌లకు, ఉత్సవాలకు రూపొందించిన నిబంధనలు అమలు చేయడంతో ఇబ్బందులు తప్పడంలేదు. యోగాంధ్ర వేడుకలకు నాలుగు రోజులు ముందుగానే ట్రాఫిక్ ఆంక్షలు విధించడం సరియైన నిర్ణయం కాదు.

కె.విజయ్‌కుమార్
విశ్రాంత ఉద్యోగి

ఎన్నడూ చూడని ట్రాఫిక్

విశాఖపట్నం నుండి వివిధ ప్రాంతాలకు రోజూ కారులో ప్రయాణిస్తుంటాను. ఇన్నాళ్లలో ఇటువంటి ట్రాఫిక్‌ను ఏనాడూ చూడలేదు. సాధారణంగా విశాఖపట్నం నుండి శ్రీకాకుళం వెళ్లేందుకు గంటా 45 నిమిషాల నుండి రెండు గంటల సమయం పట్టేంది. కానీ బుధవారం సుమారు 5 గంటల సమయం పట్టింది.

జె.ప్రకాష్
ప్రయివేటు ఉద్యోగి

మొదటి పేజీ తరువాయి..

పేదోళ్లకు చేదోడు ఏదీ?

ఉంది. ప్రభుత్వం హడావిడిచేసినంతగా ఆచరణలో పి4 అమలు కావడంలేదు. పేద కుటుంబాలను దత్తత తీసుకోవడానికి పేర్లు నమోదుచేసుకున్న 2029 మందిలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలో తక్కువ మంది ఉన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఇతర నియోజకవర్గాల కంటే ఎక్కువగా 13,584 పేద కుటుంబాలను అర్హులుగా గుర్తించినప్పటికీ, 69 మంది మాత్రమే సాయానికి తమ పేర్లను నమోదుచేసుకున్నారు.

యోగా ఒక గ్లోబల్ ఈవెంట్..

విశాఖ నగరం గిన్నిస్ బుక్ రికార్డు నెలకొల్పేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందిని ఈ యోగా ప్రదర్శనలో భాగం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 25 వేల మంది విద్యార్థులు 108 సూర్య నమస్కారాలు చేస్తారని, వీటన్నింటికీ విశాఖ వేదికగా మారనుందని చెప్పారు. కేంద్రం నిధులతోనే యోగా నిర్వహిస్తున్నామన్నారు. అందరూ దీనిలో భాగం కావాలని కోరారు. 14 సంవత్సరాలు పైబడినవారంతా కార్యక్రమంలో పాల్గొననుండగా, దూరప్రాంతాల నుంచి వచ్చే వారికోసం రవాణా, భోజన వసతి, బస, మరుగుదొడ్ల ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. తెల్లవారుజామున 5 గంటలకే కార్యక్రమ ప్రాంగణాలకు చేరేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమ విజయవంతానికి వాలంటీర్లు, సిబ్బంది కట్టుబడి ఉండాలిలని కోరారు. ఈ కార్యక్రమ విశిష్టతను మీడియా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

కేంద్ర నిధులతోనే యోగాంధ్ర

యోగాంధ్ర కార్యక్రమాలు కేంద్రం నిధులతోనే నిర్వహిస్తున్నామని, కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బిసి జనార్ధన్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ పాల్గొన్నారు.

యోగాంధ్రతో ట్రాఫిక్ కష్టాలు

వాహనాలన్నిటిని ఒక్కసారిగా ఇసుకతోట హైవే వైపుకు మళ్లించడంతో నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, ద్వారకా నగర్, సీతంపేట, రైల్వేస్టేషన్, మద్దిలపాలెం, జగదాంబ జంక్షన్ ప్రాంతాల్లో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆంక్షలు మొదలుపెట్టిన తొలిరోజే ఇలా ఉంటే మరో మూడు రోజులు ఈ ఆంక్షలు కొనసాగనున్న నేపథ్యంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు వెంటనే తగిన ప్రణాళికలు రూపొందించి, రానున్న మూడు రోజులు కూడా ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిబ్బంది కొరత

ఎప్పటినుండో విశాఖపట్నం పోలీస్ శాఖలోని ట్రాఫిక్ విభాగాన్ని సిబ్బంది కొరత సమస్య వేధిస్తోంది. దీనికి తోడు అధిక శాతం సిబ్బందిని విఐపిల ప్రయాణ మార్గాల్లో పని చేసేందుకు కేటాయించడంతో ఇతర మార్గాల్లో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు సిబ్బంది లేకుండా పోయారు. ట్రాఫిక్ మళ్లింపుపై ముందస్తు ప్రణాళికలు లేకుండా ఆంక్షలు విధించారంటూ పోలీస్ శాఖపై ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుండి విశాఖపట్నం చేరుకోవాల్సిన అదనపు బలగాలు ఇంకా విశాఖ రాకపోవడంతో ఉన్న సిబ్బందితోనే అధికారులు పనిచేస్తున్నారు. సాధారణంగా జూ నుండి మద్దిలపాలెం రావడానికి కేవలం 15 నిమిషాలు పట్టే ప్రయాణ సమయం బుధవారం గంటన్నరకు పైగా పట్టిందని ఒక క్యాబ్ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాఫిక్ కారణంగా డిఎస్‌సి పరీక్షకు ఆలస్యమైందని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు మంత్రుల తాకిడి

మూడు నాలుగు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, రాష్ట్ర మంత్రులు మొత్తం విశాఖలో యోగాంధ్ర ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. వివిధ ప్రాంతాల్లో సమీక్షలు, సమావేశాలు, పరిశీలన అంటూ తిరుగుతుండడంతో విఐపి ప్రోటోకాల్ కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాన్వాయిలు వెళుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ముందుగానే ఆపేయడంతో పలు ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ జాములు ఏర్పడ్డాయి.

బుక్కా వీధిలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ధర్నాలో పాల్గొన్న బుక్కావీధి ప్రజలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 38వ వార్డు పరిధి బుక్కా వీధిలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన మహిళలు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, విశాఖపట్నాన్ని మరో సింగపూర్, ముంబై చేస్తామని చంద్రబాబు చెపుతున్నారని, మంచినీరు సరఫరా చేయలేనివారు ఈ నగరాన్ని ఉద్ధరిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనేక నెలల నుండి మంచినీటి సమస్యపై మహిళలు నిరసన తెలియజేస్తున్నా జివిఎంసి అధికారులకు కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. 38వ వార్డులో రోడ్లన్నీ తవ్వేసి నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా బాగు చేయకుండా, జివిఎంసి పాలకులు, అధికారులు ఉన్నారని విమర్శించారు. మంచినీటి కుళాయిల పైపులైన్లలో మురుగునీరు కలిసి పోతుందని అనేక సార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేసినా, కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నెలల కిందట కలెక్టర్‌ను కలిసి సమస్య గురించి వివరిస్తే నెల రోజుల్లో మంచి నీటి సమస్యను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా జివిఎంసి అధికారులు హామీ ఇచ్చినా నేటికీ పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా మంచినీరు ఇచ్చి ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్యం కాపాడాలని, లేనిపక్షంలో యోగా రోజున బీచ్ రోడ్డులో మహిళలతో యోగా చేసి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, సూరాడ లక్ష్మి, సత్య, రామలక్ష్మి, ఎల్లయ్యమ్మ, రమ, అమర సత్య, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాల పంపిణీ

పుస్తకాలు అందుకున్న విద్యార్థులలో ఎల్ఐసి యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సరోజ చౌదరి వర్ధంతి సందర్భంగా బుధవారం దక్షిణ నియోజకవర్గంలోని కొబ్బరి తోట ఏరియాలో ఉన్న వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, విద్యార్థి ట్యూషన్ సెంటర్‌లో 35 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, కంపాస్ బాక్స్, పెన్నులు, పెన్సిల్ సెట్ అందజేశారు. ప్రతి సంవత్సరం కూడా సరోజ చౌదరి వర్ధంతి సందర్భంగా పిల్లలకు పుస్తకాలను అందిస్తున్నారు. ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులకు విసిసి కన్వీనర్ కె.సుశీల ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎల్ఐసి ఉమెన్ సెల్ ప్రతినిధులు ఎం.కామేశ్వరి (ప్రెసిడెంట్ ఐసిఎయు), పూర్ణిమ (వైస్ ప్రెసిడెంట్), సూర్యప్రభ (ఉమెన్ కన్వీనర్), నాయకులు వైవి.సతీష్, ఎన్.శ్రీనివాస్, హరి జ్యోతి పాల్గొన్నారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని కోరారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు జాహ్నవి, భారతి, సుశీల పాల్గొన్నారు.

కెకె.రాజును సన్మానిస్తున్న నాగేంద్ర

కెకె.రాజుకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులైన జీలకర్ర నాగేంద్ర బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె రాజుని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ ప్రచార బాధ్యతలు అప్పగించినందుకు కెకె.రాజుకు నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

మౌర్య నందమూడికి పోర్టు చైర్మన్ అభినందనలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : భారతదేశం తరపున అండర్-19 వాలీబాల్ జట్టులో ఎంపికైన మాస్టర్ మౌర్య నందమూడిని విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందనలు తెలిపారు. ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన సిఎవిఎ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావడం విశాఖ వాసులు గర్వించదగిన విషయం అని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విశాఖపట్నం పోర్టు కార్యదర్శి టి.వేణు గోపాల్ మౌర్యకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మౌర్య తండ్రి విశాఖపట్నం పోర్డులో ఉద్యోగిగా ఉన్నారు.

మౌర్య నందమూడిని అభినందిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

11 వార్డులకు వైసిపి అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో వైసిపి వార్డు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. 27వ వార్డుకు నీలాపు సర్వేశ్వరరెడ్డి, 29 వార్డుకు పీతల శ్రీనివాస్, 30వ వార్డుకు దశమంతుల మాణిక్యాలరావు, 31వ వార్డుకు దొడ్డి బాపూఆనంద్, 32వ వార్డుకు రాజారెడ్డి, 34వ వార్డుకు తోట పద్మావతి (కార్పొరేటర్), 35వ వార్డుకు అలపన కనకరెడ్డి, 36వ వార్డుకు మహ్మద్ షఖీల్, 37వ వార్డు ఆకుల ఏసు, 38వ వార్డు గురజాపు రవి, 39వ వార్డు ముజీబ్ ఖాన్, 41వ వార్డుకు కోడిగుడ్ల శ్రీధర్ అధ్యక్షులుగా నియమితులయ్యారు. 33వ వార్డు అధ్యక్షున్ని నియమించాల్సి ఉంది.

వాసుపల్లికి కృతజ్ఞతలు

పార్టీ అభివృద్ధికి కోసం అహర్నిశలు కష్టపడినవారికి దక్షిణ నియోజకవర్గంలో వైసిపి వార్డు అధ్యక్షుల పదవులు వరించిన నేపథ్యంలో బుధవారం ఆశీలుమెట్ట కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, పార్టీ దక్షిణ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను వార్డు అధ్యక్షులు అందరూ కలిసి అభినందనలు తెలిపారు. వాసుపల్లి అభ్యర్థన మేరకు దక్షిణ వార్డు అధ్యక్షుల పదవి తమకు కేటాయించినందుకు పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి, అదిష్టాన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణంలో వాసుపల్లిని అఖండ మెజార్టీతో గెలిపించుకునే విధంగా తామంతా కష్టపడి వైసిపి బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడించారు. వారందరినీ వాసుపల్లి గణేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలు ఆపడం సరికాదు

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నెలకు రూ.12 వేలు లోపు వేతనాలు పొందుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింప చేయకపోవడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. తల్లికి వందనం బాధితులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గ్రంధి గౌరి పిల్లల ఫీజు నిమిత్తం రూ.5 వేలు సొంత నిధులను గణేష్ కుమార్ ఆమెకు అందజేశారు. బుధవారం ఆశీలుమెట్ట కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అవుట్ సోర్సింగ్ కారణంగా తల్లికి వందనం పథకం పొందలేని వారు ఎందరో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పథకాలు అందక, మధ్య తరగతి, పేదలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారన్నారు. పెరిగిన ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం తల్లిదండ్రులకు గుదిబండలుగా మారయన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ అమ్మ ఒడి అందించడంతోపాటు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన అన్ని వసతులు కల్పించారని చెప్పారు. ల్యాప్‌టాప్‌లు కూడా ఇచ్చి ప్రోత్సహించారన్నారు. చంద్రబాబు అమలు కాని హామీలిచ్చి ఇప్పుడు కోతలు పెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, వడ్డాది దిలీప్, కోన శంకర్, దశమంతుల మాణిక్యాలరావు పాల్గొన్నారు.

వాయు ఫుడ్ డెలివరీ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం నగరంలో వాయు ఫుడ్ డెలివరీ యాప్ సేవలు బుధవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ అనిరుద్ధ కోటగిరి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో ఫుడ్ డెలివరీ సేవలు వెనుకంజలో ఉన్నాయని, తమ సంస్థ ద్వారా ఫుడ్ డెలివరీ సేవలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. భారతదేశంలోనే తమ సంస్థ జీరో కమిషన్‌పై ఫుడ్ డెలివరీ చేస్తుందని తెలిపారు. అనేక రెస్టారెంట్లను వ్యాపార రంగంలో బలోపేతం చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా, వ్యాపార, పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరానికి తమ సంస్థ సేవలు విస్తరించడం ఆనందదాయకంగా ఉందన్నారు. తమ సంస్థ పలు ప్రాంతాలలో ఫ్రాంచేజీలు తెరిచేందుకు సిద్ధంగా ఉందని, ఔత్సాహికులు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం

ప్రజాశక్తి -తగరపువలస : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని పలువురు సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో సిఐటియు భీమిలి మండల మహాసభ జరిగింది. ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన ఈ సభలో సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, వచ్చేనెల 9 జరగనున్న అఖిల భారత పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. స్టీల్ ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు ఎస్ అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, ఎం.రాము, వి నాగరాజు పాల్గొన్నారు.

సిఐటియు మండల కమిటీ ప్రతినిధులతో మూర్తి,తదితరులు

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికైంది. సిఐటియు మండల కమిటీ అధ్యక్షులుగా నీలాతి రాము, కార్యదర్శిగా జి శ్రీను, ఉపాధ్యక్షులుగా ఎం పల్లా పెంటరాజు, సహాయకార్యదర్శిగా ఎం ఈశ్వరరావు, కోశాధికారిగా ఎస్ వెంకట సత్యం ఎన్నికయ్యారు. ఆశా, అంగన్వాడీలు, విఎఒలు, స్కార్ఫ్, తోపుడుబళ్ల కార్మికులు,తదితర రంగాల నుంచి సభ్యులుగా నియమించారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

పుస్తకాలు, కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కుమారి

ప్రజాశక్తి -రావికమతం: ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి కుమారి సూచించారు. ఈ సందర్భంగా బుధవారం కవగుంట ఎంపీయుపి పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సర్పంచి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజన పథకాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యా కిట్లను ప్రధానోపాధ్యాయులు ఎంఎస్.స్వర్ణకుమారి ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెదపాటి కళ్యాణ్, బొడ్డేడ బాలాజీ, సత్యనారాయణ, రాజారావు, నడిపిల్లి సన్యాసిరావు, వేగి పవన్, వేగి సాయి, స్కూల్ కమిటీ చైర్మన్ ఆళ్ళ శ్రీను, వైస్ చైర్మన్ ఒ.వెంకటరావు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు రాంజీ ఎస్టేట్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల కింద పాఠ్యపుస్తకాలు, వర్క్, నోటు పుస్తకాలు, యూనిఫాం, స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులతో సహా రూ.2,279 విలువైన కిట్లను ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు బుధవారం పంపిణీ చేశారు. కిట్‌లోని అన్నివస్తువుల నాణ్యత బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కామేశ్వరి, మండల ప్రెసిడెంట్ అరుణ్‌బాబు, అరుణ, మోజెస్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -తగరపువలస : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.విశాఖ నగరం, ఎంవిపి కాలనీలో ఉన్న ఎమ్మెల్యే నివాసంలో గంటాను కలిసి పలు జ్యూట్ కార్మిక సంఘాల నాయకులు, తమకు రావాల్సిన బకాయిలు పూర్తిగా చెల్లించేవరకు జ్యూట్‌మిల్లు ఆస్తులు అమ్మకుండా యాజమాన్యాన్ని నిలువరించాలని కోరారు. పిఎఫ్, వేతన బకాయిలు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికసంఘాల నేతలు జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరెడ్డి (ఐఎన్‌టియుసి), దల్లి అప్పలరెడ్డి, ఎం ఆదినారాయణ రెడ్డి (కాకాస), కొండపు ఈశ్వర రావు (చిట్టివలస లేబర్ యూనియన్) ఉన్నారు. ఇవే సమస్యలపై జాయింట్ లేబర్ కమిషనర్‌కు కూడా వినతి పత్రం అందజేశారు.

గంటాకు వినతిపత్రం ఇస్తున్న జ్యూట్ కార్మిక నేతలు

వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాబా

కెకెరాజును కలిసిన బాబా

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కెవి.బాబా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్రకార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. బుధవారం వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజును ఆయన కార్యాలయంలో బాబా మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర విభాగానికి ప్రధాన కార్యదర్శి గా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు, శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఐ వాచ్ ఫరూఖీ, జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ బర్కత్ ఆలీ, దేవరకొండ మార్కండేయులు, (అలియాస్)మహమ్మద్ ఇబ్రహీం, 39వ వార్డు అధ్యక్షులు ముజీబ్ ఖాన్, దక్షిణ నియోజక వర్గ మైనార్టీ అధ్యక్షులు బాబ్జి, జిల్లా మైనారిటీ సెల్ సెక్రటరీ నిజాం, సీనియర్ నేత భాషా పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాటు తుపాకీతో అన్నను హతమార్చిన తమ్ముడు

ప్రజాశక్తి -చీడికాడ: గ్రామంలో అన్నదమ్ములు ఇద్దరు కలిసి సరదాగా పండగ చేసుకున్నారు. అనంతరం వారి పాక వద్ద ఒకరి ఆవు పాలు వేరొకరి దూడ తాగేసిందని గొడవలకు దిగారు. నీ అంత చూస్తానంటే నీ అంత చూస్తానని వాగ్వాదం చేసుకున్నారు. ఈ ఘటనలో నాటు తుపాకీ కి ఒకరు బలయ్యారు.

పోలీసుల కథనం మేరకు... చీడికాడ మండలం తురువాలు గ్రామంలో గ్రామ దేవత పండగ జరుగుతోంది. తురువోలు గ్రామానికి చెందిన జోగా రాము, దేవుళ్ళు అన్నదమ్ములు. వీరు మద్యాన్ని సేవించారు. పొలంలో పాక వద్ద మేకలు, ఆవులు, విషయంలో గొడవపడి ఇద్దరు అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. దేవుళ్ళు ఆవు పాలు పెయ్య తాగేసిందని ఇద్దరి మధ్య గొడవ మొదిరింది. ఒకరిపై ఒకరు హంతం చూస్తానని వాదించుకున్నారు. ఇంతలో పాకలో ఉన్న నాటు తుపాకీతో తమ్ముడు దేవుళ్ళు అన్నపై కాల్పులు జరిపాడు. తుపాకీ తూటాలు పక్కభాగంలో దూసుకు పోవడంతో కుప్ప కూలిపోయాడు. కొన ఊపిరితో ఉన్న అన్న రామును స్థానికులు పొలంలో కల్లాల వద్ద నుంచి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న కే. కోటపాడు సిఐ పైడపునాయుడు, ఎస్సై నారాయణరావు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జోగా రాము మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ కి తరలించారు. పరారీలో ఉన్న జోగా దేవుళ్ళు ఆటో స్టాండ్‌లో పట్టు బడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం సిఐ పైడపునాయుడు మాట్లాడుతూ నియోజవర్గంలో లైసెన్స్ లేని నాటు తుపాకులు ఎవరి వద్ద ఉన్న వారం రోజుల్లో స్టేషన్ కి అప్పగిస్తే కేసు లేకుండా కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తామన్నారు. నాటు తుపాకులు వాడితే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు కొత్తపేటకు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది.. భీమిలి సిఐ బి.తిరుమల రావు కథనం ప్రకారం వివరాలివి.

కొత్త పేటకు చెందిన ఆంధ్ర కనకరాజు (42) ఇంట్లో తాను అద్దెకు ఉంటున్న మేడపై ఇంటిగదిలో ఫ్యాన్ కు చీరతో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. కొన్నాళ్ళక్రితం సొంతంగా చికెన్ దుకాణం నిర్వహించే కనకరాజు, తర్వాత భీమిలిలో ఓ చికెన్ దుకాణంలో పని చేసేవాడు. కొద్ది రోజులుగా పనిలేక ఖాళీగానే ఉంటున్నాడు. తొలి నుంచి మద్యానికి బానిసైన ఇతను, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని సిఐ,బి తిరుమలరావు, ఎస్ఐ ఎన్ శ్రీనివాసరావు పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతునికి భార్య చాందిని, ఇద్దరు కొడుకులున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సన్యాసిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత పాఠశాలలో తాగునీటికి కటకట!

మూడు రోజులుగా పాడైన మంచినీటి బోరు మోటారు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌లో తాగునీరు లేక మూడురోజులుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలోని తాగునీటి మోటారులో సాంకేతిక సమస్య తలెత్తడంతో అది పనిచేయకపోవడంతో తాగునీటికి కటకట తప్పడం లేదు.ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 510 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంతమందికి ప్రత్యామ్నాయంగా తాగునీరు అందించడం ఒకింత కష్టమైన పనే. అయితే హెచ్‌ఎం ఆదినారాయణ చొరవ తీసుకుని తోటి ఉపాధ్యాయుల సహకారంతో జివిఎంసి అధికారులకు తాగునీటి సమస్యను చెప్పగా, వెంటనే ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో, స్టీల్‌క్యాన్లలో తాగునీరు నింపి విద్యార్థులకు తాగు నీరు అందించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ పాఠశాల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డ్రమ్ముల్లోని నీటిని పట్టుకుంటున్న విద్యార్థులు

ప్రైవేట్ విద్యాసంస్థలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రయివేట్ కళాశాలలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి

జివిఎంసి ఏడోవార్డు మిధిలాపురి వుడకాలనీలో ఓ బహుళ అంతస్తు భవనంలో విశ్వ కళాశాల, వసతి గృహం నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో భవనం నాలుగో అంతస్తులో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన కాలేజీ యాజమాన్యం విద్యార్థులందరికీ వేరే క్యాంపస్‌కు తరలించారు. అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో నాలుగో అంతస్తులోని ఆ గదిలో సామగ్రి దగ్ధమైందని తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు..పిఎం పాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద కారణాలపై ఆరా తీశారు. విద్యా శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు.

విశ్వ పాఠశాల భవనంలోంచి వస్తున్నపొగలు

మోటూరు హనుమంతరావుకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రజాశక్తి దినపత్రిక వ్యవస్థాపక సంపాదకులు, సిపిఎం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కామ్రేడ్ మోటూరు హనుమంతరావు 24వ వర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. మోటూరు చిత్ర పటానికి ప్రజాశక్తి ఎడిషన్ సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ మోటూరు హనుమంతరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, ఎంపీగా పీడిత ప్రజల తరపున తన గళాన్ని వినిపించారని తెలిపారు. ప్రజాశక్తి సంపాదకులుగా సున్నితమైన పదజాలంతో సూటిగా తెగిలే విధంగా సంపాదకీయాలు రాసేవారన్నారు. విశాలాంధ్రకు ఎనిమిది సంవత్సరాలు సంపాదకునిగా ఉన్న ఆయన ఆ తరువాత ఆయన సంపాదకత్వంలోనే ప్రజాశక్తి దినపత్రిక ప్రారంభమైందని చెప్పారు. ఆయన వేసిన పునాదులతోనే నేడు ప్రజాశక్తి ఈ స్థితికి చేరిందని తెలిపారు. అందరితో చాలా స్నేహపూర్వకంగా, నిరాడంబరంగా మెలిగేవారన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. సబ్ ఎడిటర్ ఆర్కే.నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎడిషన్ సమన్వయ కమిటీ సభ్యులు టి.అప్పలరాజు, ప్రజాశక్తి ఉద్యోగులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు

జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాభివృద్ధిని పెంచుకుంటే భవిష్యత్‌లో రాణించి మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఎంవిఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి రామారావు అన్నారు. బుధవారం గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఏడాది తమ కళాశాలలో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎపికి చాలా కంపెనీలు వస్తున్నాయని, వాటిల్లో మెండుగా ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి నైపుణ్యం, ప్రతిభ ఉన్నవారికి ఉద్యోగాలు వరిస్తాయని, ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.
కాలేజీ ప్లేస్‌మెంట్ అధికారి వి.ఎ.కామేశ్వరరావు మాట్లాడుతూ, జాబ్ మేళాకు 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై, 300 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, వారిలో 75 మంది ఉద్యోగావకాశాన్ని కల్పించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం వర్తింపజేయాలి

ప్రజాశక్తి- మాధవధార : నిబంధనల కారణాలతో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందరికీ అందడం లేదని, ఇటీవల తల్లికి వందనం పథకంలో ఎందరో అర్హులకు లబ్ధి చేకూరలేదని బిజెపి నేత మూల వెంకటరావు అన్నారు. దీనిపై సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యామంత్రి నారా లోకేష్ దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం, ఉచిత గ్యాస్ ఇతర పథకాల నిబంధనలను సడలించాలని, ఆప్కాస్ కార్మికులు, నెలసరి ఆదాయం రూ. 25వేలు వరకు ఉన్నవారికి, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. నిత్యవసరాల ధరాభారం, ఇతర సమస్యలతో కుటుంబపోషణకు అవస్థలు పడుతున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొండంత అండగా ఉంటాయని, కూటమి ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలని కోరారు.

భోజన నాణ్యత ఇలా..
విద్యార్థుల ఆరోగ్యం ఎలా..?

జివిఎంసి హైస్కూల్‌లో ఉండలు, ముద్దగా ఉన్న అన్నం

- మధ్యాహ్న భోజనంపై కొరవడిన పర్యవేక్షణ
- బడి పిల్లలకు ఉదయం పూట అందని రాగి జావ
- ప్రైవేట్ ఏజెన్సీ భోజన పదార్థాల్లో నాణ్యత కరువు
- అయిష్టంగా తింటున్న పలు పాఠశాలల విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కొత్త విద్యా సంవత్సరంలో పాఠశాలలు పున్ణప్రారంభమై వారం రోజులైంది. బడి పిల్లలకు పెడుతున్న మధ్యాహ్న భోజనం ఎలా ఉందన్నదీ తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా ప్రజాశక్తి రెండ్రోజుల పాటు జివిఎంసి పరిధిలోని పలు ఉన్నత పాఠశాలలకు వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ముద్దగా ఉండలతో కూడిన అన్నం, నీళ్లలా సాంబారు, పలుచగా ఇగురుతో కూడిన గుడ్డు కూర ఒకరోజు మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వడ్డించారు. ఉండలా ఉన్న అన్నం చూసి, తినేందుకు విద్యార్థులు ఒకింత ఇష్టపడడం లేదు.ఇక ఇతర ఆహారపదార్థాల నాణ్యత కూడా అంతంత మాత్రమే. ఇలాంటి భోజన పదార్థాలను విద్యార్థులకు అందజేసి, పౌష్టికాహారం ఇస్తున్నట్లు ప్రభుత్వాలు చెప్పుకోవడానికి పలువురు ప్రశ్నిస్తున్నారు.

పాఠశాలలు పున:ప్రారంభం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో సన్న బియ్యం అన్నం పెడతామని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. అయితే ఆచరణలో అందుకు భిన్నంగా ఉందని పలువురు అంటున్నారు. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా వండిన భోజన పదార్థాలు నేరుగా పాఠశాలలకు చేరుతుండడంతో, వాటికి వాడిన బియ్యం, ఇతర సరుకుల నాణ్యత ఇక్కడి వారికి తెలియని పరిస్థితి, అయితే వచ్చిన అన్నం చూస్తే బియ్యం నాణ్యమైనవి (సన్నబియ్యం) మాత్రం కావని ఇట్టే చెప్పొచ్చని స్పష్టమౌతోంది.

కానరాని రాగి జావ..

ఇలా ఉండగా విద్యార్థులకు రోజూ ఉదయం ఇంటర్వెల్ సమయంలో రాగి జావ ఇచ్చేవారు. ఈ ఏడాది పాఠశాలలు పున్ణప్రారంభం నుంచి

పాఠశాల వరండాలో కూర్చుని తింటున్న విద్యార్థినులు

ఇప్పటి వరకు రాగి జావ ఇవ్వలేదు. రాగి పిండి, బెల్లం ప్యాకెట్ ప్రతి మూడు నెలలకు ఓ సారి పాఠశాలలకు ప్రభుత్వమే సరఫరా చేసేది.. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాగి జావ తయారు చేసి విద్యార్థులకు ఇచ్చేవారు. ప్రస్తుతం రాగి జావ ఊసే లేదు. మధ్యాహ్న భోజనం లాగానే రాగి జావ పంపిణీని కూడా 'ప్రైవేట్' ఏజెన్సీకి అప్పగించే యోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

ఇలా ఉండగా ప్రైవేట్ ఏజెన్సీ సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనంలో అన్నం ముద్దగా ఉండడాన్ని కొందరు హెచ్ఎంల వద్ద ప్రస్తావించగా సన్న బియ్యం అన్నమే అని చెప్పారు. వేడిగా ఉన్నప్పుడు ముద్దగా ఉండడం సహజమని ఒకరిద్దరు హెచ్ఎంలు అన్నారు.

కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ..

బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం అమలు పై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలున్నాయి. రోజు వారీ పిల్లలు ఎంత మంది వచ్చారు? మెనూ అమలు ఎలా ఉంది? భోజన పదార్థాల నాణ్యత ఎలా ఉంది? మధ్యాహ్న భోజనం పట్ల విద్యార్థులు సంతృప్తిగా ఉన్నారా? తది తర అంశాలపై పర్యవేక్షణ అవసరం భోజన నిర్వాహకుల నుంచి రోజువారీ నివేదికలను విద్యాశాఖ అధికారులు తెప్పించుకుని పరిశీలించడం తో పాటు నేరుగా పర్యవేక్షణ కూడా చేయాలి.

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం వల్లే సమస్యలు?

మధ్యాహ్న భోజన కార్మికులను కేవలం వడ్డించే వారిగానే పరిగణిస్తూ, వాటి తయారీ, నిర్వహణ, ఇతర బాధ్యతలు ప్రయివేటు ఏజెన్సీలు చూస్తుండడం వల్లే సమస్యలు వస్తున్నాయని, అదే పూర్తిస్థాయిలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పథక నిర్వహణను అప్పగించి ఉంటే ఈ తరహా సమస్యలు ఉత్పన్నం కావని పలువురు అభిప్రాయ పడుతున్నారు.జివిఎంసి ఒకటో జోన్, మండలంలో కలిపి 22 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 9 యుపి పాఠశాలలు, 67 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు సుమారు 8 వేల మంది విద్యార్థులు మధ్యాహ్నభోజన పథక లబ్ధి పొందుతున్నారు. వీరందరి ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా,బాధ్యతగా ఉండాలంటే మధ్యాహ్న భోజన నిర్వహణ, ఆహార పదార్థాలన నాణ్యతపై సరైన పర్యవేక్షణ ఉండాలని పలువురు అంటున్నారు.

మదపాడ కుటుంబానికి పలువురి పరామర్శ

నివాళులర్పిస్తున్న చిన్నశ్రీను, తదితరులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని గండిగుండం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మదపాడ అచ్చిబాబు, ఆయన కుమారుడు బంగారయ్య సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. అచ్చిబాబు కుమారుడు మదపాడ శ్రీను, ఇతర కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో పలువురు రాజకీయ నాయకులు, అభిమానులు, బంధుమిత్రులు, స్థానికులు పాల్గొని అచ్చిబాబు, బంగారయ్య చిత్రపటాలకు నివాళు లర్పించారు. మదపాడ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబానికి అన్నివేళలా తాము అండగా ఉంటామని పలువురు నేతలు ధైర్యం చెప్పారు. మదపాక కుటుంబ సభ్యులు బాబోజమ్మ అప్పలరాజు, దుర్గారావు, ప్రసాద్, మహేష్, రాజేష్‌లను పరామర్శించి, సంతాపం తెలిపారు.
సంతాపం తెలిపిన వారిలో భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే ఆదీప్‌రాజు, పీలా గోవింద సత్యనారాయణ, పీలా శ్రీనివాసరావు, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు, విఎంఆర్‌డిఎ మాజీ చైర్మన్ అక్రమాని విజయనిర్మల, వెంకట్రావు, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శ్రీనివాస్, కౌన్సిలర్ ముక్క ముత్యాలనాయుడు, శ్రావణి, టిడిపి నేతలు కోరాడ రాజబాబు, గన్‌రెడ్డి సోంబాబు, జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, స్థానిక నాయకులు బంక సత్యం, గన్‌రెడ్డి శ్రీనివాసరావు, కాకర్లపూడి శ్రీకాంత్, మజ్జి వెంకట్రావు, పాండ్రంకి శ్రీను, బొట్టా రామకృష్ణ, మదపాడ సత్తిబాబు, తాట్రాజు ఆదినారాయణ, బిఆర్‌బి నాయుడు, బంక సూర్య నారాయణ, సింహాచలం నాయుడు, బంక శ్రీను, బంక కృష్ణం నాయుడు ఉన్నారు.

గంభీరం పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ

ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ దంపతులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలో గంభీరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు విశాఖపట్నం ఎండాడకు చెందిన ఎన్‌ఆర్‌ఐ దంపతులు దుర్గ మల్లికార్జునరావు, సావిత్రి ల్యాప్‌టాప్ వితరణగా అందజేశారు. బోధనలో సాంకేతికత వినియోగం పెరగాలన్న సంకల్పంతో విద్యార్థులకు మేలు చూకూర్చాలని దీని అందజేశామన్నారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యువివి. ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఆధునిక బోధనా పద్ధతులను అందించడంలోనూ, అలాగే విద్యార్థుల సమాచారం ఆన్‌లైన్‌లో నిర్వహణకు ఈ ల్యాప్‌లాప్ ఉపయోగపడుతుందని, ఆ దిశగా దీన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. గ్రామస్థాయి విద్యాభివృద్ధికి సహకారం మరింత అవసరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లలిత, శివగంగ, వరలక్ష్మి, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేట సాగక.. పూట గడవక...

- అగమ్యగోచరంగా మత్స్యకారుల జీవితాలు
- ఎన్‌టిపిసి, ఫార్మా వ్యర్థాలతో అంతరిస్తున్న మత్స్య సంపద
- పరిశ్రమల్లో ఉద్యోగాల హామీలు అమలు కాని వైనం
- ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్న గంగపుత్రులు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని మత్స్యకారులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. సముద్రంలో వేట సాగక.. ఉపాధి కొరవడి కుటుంబ పోషణ భారంగా మారింది. మత్స్యకార ప్రాంతం ముత్యాలమ్మపాలెం తదితర గ్రామాలను ప్రజాశక్తి ప్రతినిధి పర్యటించగా మత్స్యకారులు తమ సమస్యలు చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎన్‌టిపిసి వల్ల ఉప్పుటేరులో ఫ్లై యాస్, ఫార్మా కంపెనీల వలన వ్యర్థ జలాల కారణంగా మత్స్య సంపద అంతరించిపోతుందని, దీంతో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్ళవలసి వస్తుందని పలువురు తెలిపారు. 'చేపలు పట్టే వలలే కాదు, మా జీవితాలు మొత్తం చిదుర్లే అయ్యాయి' అంటూ ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన ఒక వృద్ధ మత్స్యకారుడు ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలోని ముత్యాలమ్మపాలెం, సమ్మంగిపాలెం, దిబ్బపాలెం, జాలారిపేట, తిక్కవానిపాలెం వంటి గ్రామాలలో మత్స్యకారులే మెజారిటీ. సుమారు 12 వేలకు పైగా కుటుంబాలకు జీవనోపాధిగా చేపల వేటే ప్రధాన ఆధారం. వీరి చేపల వేటకు అవసరమైన మేరకు తీరంలో తగిన మౌలిక వసతులు లేవు. ముఖ్యంగా జెట్టీ లేకపోవడం వారికి ప్రధాన సమస్యగా ఉంది. వేటకు వెళ్లిన తెప్పలు తిరగబడడం, తుఫానుల్లో ప్రాణాలు కోల్పోవడం షరా మామూలైంది.

ముత్యాలమ్మపాలెం తీరంలో బోట్లు వద్ద మత్స్యకారులు

ప్రతి ఏటా రెండు నెలల పాటు చేపల వేట నిషేధం ఉంటుంది. దానికి తోడు తుఫానుల వల్ల నాలుగైదు నెలలు ఉపాధి ఉండడం లేదు. దీంతో మత్స్యకారులు దిక్కుతోచని స్థితిలో కొంతమంది ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల్లో వలలు అల్లే పనులు చేస్తున్నారు. అక్కడ కూడా అనేక ఇబ్బందులు పడుతూ ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు కూడా ఉన్నాయి.

పరిశ్రమల వ్యర్థాలతో అంతరిస్తున్న మత్స్య సంపద

పరవాడ మండలంలో ఉన్న ఫార్మా పరిశ్రమలు, ఎన్టీపీసీ విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలు సముద్రంలోకి కలుస్తుండటంతో మత్స్య సంపద అంతరించిపోతుంది. చేపలు చనిపోతున్నాయి. దీంతో ముత్యాలమ్మ పాలెం తీరం నుండి 250 కిలోమీటర్లు దూరం వరకూ సముద్రంలోకి వెళ్లాల్సి వస్తోంది. ఇది రెండు, మూడు రోజుల ప్రయాణం. డీజిల్, బోటు మెయింటెనెన్స్ కలిపి ఒక్కసారి ప్రయాణానికి రూ.5వేలు నుండి రూ.10వేలు ఖర్చవుతుంది. అంత ప్రయాణం చేసినా చేపలు దొరుకుతాయన్న గ్యారంటీ లేదు.

ప్రస్తుతం డీజిల్ సబ్సిడీ రూ.9 మాత్రమే ఉంది. దీనిని రూ.20 వరకు పెంచాలన్న డిమాండ్ ఉంది. ఫైబర్ బోట్లు గతంలో 75 శాతం సబ్సిడీతో అందించగా, ఇప్పుడు 40 శాతానికి పరిమితం చేశారు. మళ్లీ పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పరిశ్రమల్లో ఉపాధిపై అమలు కాని హామీలు

పరవాడ మండలంలోని మత్స్యకారులకు ఫార్మా సిటీ కంపెనీలలో 500 మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదు. హైకోర్టు ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తున్నారు. ఎన్టీపీసీ కంపెనీలో 60 మందికి శాశ్వత ఉద్యోగాలు ఇస్తామని లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీ అమలు చేయడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ హామీలు అమలుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని, జెట్టీ నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

ఎన్‌టిపిసి, ఫార్మా సిటీలో ఉద్యోగాలు కల్పించాలి

హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేసి ఎన్‌టిపిసి, ఫార్మా సిటీ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించాలి. లేనిపక్షంలో ఎన్టిపిసి ప్రధాన ద్వారం వద్ద, ఫార్మాసిటీ రాంకీ ఆఫీసు వద్ద నిరాహార దీక్షలు చేపడతాం.

- అరిజిల్లి రవి, ముత్యాలమ్మ పాలెం

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం లేదు

సముద్రంలో మృతి చెందిన వారికి గత ప్రభుత్వం నాటి నష్టపరహారం నేటికీ అందలేదు. వేట సమయంలో చనిపోతే రూ.10 లక్షలు ఇచ్చేవారు. జాలరపేటలో ఇద్దరు, దిబ్బపాలెంలో ఒకరు చనిపోతే వారి కుటుంబాలకు ఇప్పటికీ నష్టపరిహారం ఇవ్వలేదు. సీఎం రిలీఫ్ ఫండ్ రూ.5 లక్షలు ఇచ్చేవారు. అది కూడా జాప్యం జరుగుతుంది. తక్షణమే సీఎం రిలీఫ్ ఫండ్ ఇవ్వాలి.

- వాసుపల్లి కృష్ణ, ముత్యాలమ్మ పాలెం

రొయ్యల చెరువులతో తాగునీటి సమస్య

సమ్మంగి పాలెం, జాలారిపేట గ్రామాల చుట్టుపక్కల రొయ్యల చెరువులు వల్ల భూగర్భ జలాల్లోకి సముద్రపు నీరు చేరడంతో నీరంతా ఉప్పు నీరుగా మారిపోతుంది దీనితో మంచినీటి సమస్య తీవ్రతరమైంది. వాటి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- అరిజిల్లి యర్రయ్య, ముత్యాలమ్మ పాలెం

నూతనంగా ఎన్నికైన ఐద్వా కమిటీ సభ్యులు

ఐద్వా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ టిడ్కో కాలనీలో బుధవారం జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) స్థానిక మహాసభలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐద్వా స్థానిక కమిటీ అధ్యక్షులుగా మాన్యాల బంగారమ్మ, కార్యదర్శిగా తుంపాల అన్నపూర్ణ, కమిటీ సభ్యులుగా జి.సీత, ఆర్.సీతామహాలక్ష్మి, ఎం.సంతోషి, కె.అబద్ధం, వి.మంగ, ఆర్.సీతమ్మ, ఆర్.రమణమ్మ, కె లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ ఐద్వా రాష్ట్ర మహాసభలు అక్టోబరులోనూ, జిల్లా మహాసభలు ఆగస్టులోనూ జరుగుతున్నాయని, వాటిని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలో స్థానిక సమస్యలపై చర్చించారు. రేషన్ డిపో ఏర్పాటు చేయాలని, మహిళలకు ఉపాధి కల్పించాలని, ప్రతి నెలా వైద్య శిబిరం నిర్వహించాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, గ్యాస్ ధర తగ్గించాలని, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

1187 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేస్తాం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలానికి 1187 క్వింటాళ్ళ వరి విత్తనాలు సిద్ధం చేస్తున్నామని, వాటికి 11.87 లక్షల రూపాయలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని స్థానిక వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. రైతులకు విత్తనాలు సరఫరా చేసే ముందు ప్రతి రైతు సేవా కేంద్రంలో మొలక కట్టాలని ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. మాడుగుల విత్తన పరీక్షా కేంద్రంలో కూడా మొలక శాతం పరీక్షించి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ముందుగా ప్రతి రైతు జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చి రొట్ట వేసుకోవాలని సూచించారు. మండలంలో 77 మంది రైతులకు రూ.24.77 లక్షల సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో 14 పవర్ టిల్లర్లు, 8 రోటోవేటర్లు, 21 దమ్ము సెట్లు, రెండు మల్టీక్రాప్ థ్రషర్స్, 28 ప్రేయర్లు అందజేశామని చెప్పారు.

20న విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం డి-2 సెక్షన్, 33/11కెవి అంతకపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అడిషనల్ బ్రేకర్ (ఆర్డిఎస్ఎస్) స్కీమ్ పనులు కారణంగా ఈనెల 20న శుక్రవారం ఉదయం 9 గంటల మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోధువలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, పెదయతపాలెం, బంగారమ్మపాలెం, అడ్డూరు, ఎల్లుప్పి, నాయనమ్మపాలెం, లగిశెట్టిపాలెం, గాలి భీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఎంపిడిఒ విజయలక్ష్మి మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల అభివృద్ధి అధికారి వి.విజయలక్ష్మి బుధవారం మతి చెందారు. నాలుగు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందారు. బుధవారం పరిస్థితి విషమించి మరణించారు. 10 నెలల క్రితం బుచ్చయ్యపేట ఎంపీడీవోగా ఆమె విధుల్లో చేరారు. ఉద్యోగ విరమణకు మరో 10 నెలలు మాత్రమే ఉందని కుటుంబీకులు తెలిపారు. ఎంపిడిఒగా వివాద రహితంగా మండలంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందడం పట్ల రాజకీయ, ఉద్యోగ వర్గాలవారు ఆమె మృతికి సంతాపం ప్రకటించారు. ఎంపీడీఓ మృతదేహానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు నివాళులర్పించారు.

ఎంపిడిఒ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తాతయ్యబాబు

టిడిపి పెందుర్తి ఎన్నికల పరిశీలకులుగా మహేష్

ప్రజాశక్తి-కె.కోటపాడు : రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తనను ఎన్నికల పరిశీలకులుగా నియమించిన చంద్రబాబునాయుడు, లోకేష్ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. తన బాధ్యతలను నెరవేర్చుడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. మహేష్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

డిప్యూటీ ఎంపిడిఒగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా నూతనంగా నియమితులైన ఎస్‌కెవి. ప్రసాద్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొయ్యూరు మండలంలో సేవలందించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పంచాయతీల కార్యదర్శులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రసాద్ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా మాట్లాడారు.

టిడిపి మండల అధ్యక్షులు విజయ్‌కు సత్కారం

ప్రజాశక్తి-మునగపాక : టిడిపి మునగపాక మండల అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన పెంటకోట విజయ్‌ను అచ్యుతాపురం శిల్ప గెస్ట్ హౌస్‌లో బుధవారం ఘనంగా సత్కరించారు. టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, బొడ్డేడ శ్రీనివాసరావు, ఆళ్ల మంగరాజు, ధూళి రంగనాయకులు, భీమరసెట్టి శ్రీనివాసరావు తదితర నేతలు విజయ్‌ను దుస్సాలువలతో సత్కరించారు. అనంతరం మండల నూతన కమిటీని ప్రకటించారు. పోలమరశెట్టి వీర అప్పారావు, అప్పికొండ విజయ్‌రాజు, దాడి జగన్నాథరావు, ముల్లేటి గణేష్, సారిపల్లి అప్పల శివప్రసాద్, అప్పలరాజు, ఆడారి కాశీలు, సూరిశెట్టి రాము, రేపాక మాలతి, అప్పికొండ కన్నారావు, ఆడారి నరసింహారావు, సరగడం జగన్నాథరావు, సేనాపతి శ్రీను తదితరులు నూతన కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

విజయ్‌ను సత్కరిస్తున్న టిడిపి నేతలు

కౌలు రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత

ప్రజాశక్తి-దేవరాపల్లి : పల్నాడు జిల్లాలో గిట్టుబాటు ధర లేక కౌలు రైతుల బలవన్మరణానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పులు బాధ తాళలేక పల్నాడు జిల్లాలో ఒకేసారి ముగ్గురు కౌలు రైతులు అత్మహత్య చేసుకోవడం విచారకరమన్నారు. ఇవి పూర్తిగా ప్రభుత్వ హత్యలు భావించాల్సి ఉంటుందన్నారు. అధికారంలోకి రాకముందు పవన్ కల్యాణ్ కౌలు రైతులను ఉద్ధరిస్తున్నట్లు పోజులు కొట్టారని, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా కౌలు రైతులను విస్మరించారని విమర్శించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోకపోవడం వలనే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలకు గిట్టుబాట ధర కల్పించి కౌలు రైతుల అత్మహత్యలు ఆపాలని, బలవన్మరణం చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ-భరిణికం గ్రామాల మధ్యలో మొల్లోడు గెడ్డలో రాంకీ యాజమాన్యం అక్రమంగా వ్యర్థ రసాయనికి జలాలు విడుదల చేయడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం మొల్లోడు గెడ్డను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ సిఓడి లెవెల్స్ 270 దాటి తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతూ భూగర్భ జలాల నాశనానికి కారణమవుతున్న రాంకీ యాజమాన్యానికి వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు కోరారు. వ్యర్థ రసాయనికి జలాలను శుద్ధిచేసి సముద్రంలో విడుదల చేయాల్సి ఉండగా, నిబంధనలను ఉల్లంఘించి ప్రజల ప్రాణాలతో రాంకీ యాజమాన్యం చెలగాటమాడుతుందని విమర్శించారు. దీనిపై ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్లో కేసు వేయడం జరిగిందని తెలిపారు. భరిణికం ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యారని, ఈ ప్రాంతంలో పశువుల సైతం అనారోగ్యం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టకపోతే ప్రజా ఉద్యమాన్ని చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు.

మొల్లోడు గెడ్డ వద్ద మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : డ్వాక్రా మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పే సీఈవో వాకాటి కరుణ, అదనపు సీఈవో ఆర్.శ్రీరాములనాయుడు అన్నారు. మండలంలోని నీలకంఠపురం గ్రామంలో డ్వాక్రా సంఘం సభ్యులతో బుధవారం వారు సమావేశం నిర్వహించారు. గ్రామంలో స్వయం సహాయక సంఘాల పనితీరు, తీసుకున్న రుణాల వినియోగం తదితర అంశాలపై సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని మొబైల్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 2.0 వెర్షన్‌ను ప్రయోగాత్మకంగా నీలకంఠపురం, వడ్డాది గ్రామాల డ్వాక్రా సంఘాలకు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలు సీజ్

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం, జి.సింగవరం గ్రామ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలను పోలీసులు సీజ్ చేశారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్టు మంగళవారం రాత్రి సమాచారం రాగా, అక్కడికి వెళ్లి ఎపి 39టిఎస్ 0791, ఎపి 39 టిఎస్ 4446, ఎపి07 టిఎం 1296 నెంబర్లు గల మూడు టిప్పర్ లారీలను పట్టుకొని కశింకోట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కశింకోట తహశీల్దారు వద్దకు పంపించారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల కొత్తపేట వీధిలో చేపట్టిన డ్రైనేజీ పనులను తుమ్మపాల కూటమి నాయకులు బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కొత్తపేట వీధిలో మొట్టమొదటి కార్యక్రమం నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ ఆదేశాలతో శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బొడ్డపాటి రామ్ కుమార్, అల్లం రాము, కోసూరు సంతోష్, నున్న నూకరాజు, శొంట్యాన నాగేష్, కింతాడ నూకరాజు, టిడిపి నాయకులు సందిన సునీల్, మంత్రి సత్యనారాయణ, కోసూరు వెంకట తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు తల్లికి వందనం అమలు చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్కీమ్ వర్కర్లకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఈ.నాయుడుబాబు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీ చాలని జీతాలతో గ్రామాల్లో పనిచేస్తున్న వర్కర్లందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు వాగ్దానం చేసి అధికారం వచ్చిన తర్వాత ఉద్యోగుల పేరుతో వారికి ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని పేర్కొన్నారు. వారిని ఉద్యోగులుగా పరిగణిస్తే ప్రభుత్వం వారందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వైస్ ఎంపిపి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రాంబిల్లి : వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాలం కోడూరు గ్రామంలో భవాని కళాశీ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కళాసీలకు టేబుల్స్, కుర్చీలు, ఇతర పనిముట్లు అందజేశారు. అచ్యుతాపురం ప్రాంతంలోని యాచకులకు భోజనం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎన్.రాజు (బుజ్జి), మాజీ సర్పంచ్ రుత్తల గుణాకర్, లాలం రమణ, పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : ప్రభుత్వం సరఫరా చేస్తున్న విత్తనాలను శుద్ధి చేసేందుకు మందు వాడాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్న అన్నారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు శుద్ధి కోసం సూడో మోనాస్ ఫ్లోరసెన్స్ కేజీకి 10 గ్రాములు చొప్పున వేయాలని, దీని ద్వారా తెగుళ్లను అరికట్టవచ్చని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఆధార్, రైతు పాస్ బుక్, బ్యాంకు లింక్ ఫోన్ నెంబర్ లింక్ ఉంటే సచివాలయానికి వెళ్లవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎఒ ఎస్‌కె.ఫిరోజ్‌ఖాన్, ఎంపిఇఒ కుమార్, రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వైసిపి కార్యకర్తపై దాడి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరసింహమూర్తి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త యర్రా నరసింహమూర్తిపై కత్తితో దాడి జరిగిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. బాధితుడి తెలిపిన వివరాలు ప్రకారం... నరసింహమూర్తి బుధవారం పొలంలో పని చేసుకుంటూ ఉండగా టిడిపికి చెందిన సింగంపల్లి పోలునాయుడు, లక్ష్మి దంపతులు దాడి చేశారు. లక్ష్మి నరసింహమూర్తి కళ్లల్లో కారం కొట్టగా, పోలునాయుడు కత్తితో దాడి చేశారు. దీంతో నరసింహమూర్తి తలపై, చేతిపై తీవ్ర గాయాలై అపస్మారస్థితిలో పడిపోగా కుటుంబ సభ్యులు దేవరాపల్లి పిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో కె. కోటపాడు సిహెచ్‌సికి తరలించారు. తనపై దాడి చేసిన భార్యాభర్తలు పోలునాయుడు, లక్ష్మిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, తనకు ప్రాణానికి రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు. ఈ సంఘటనపై టిడిపి చెందిన సింగంపల్లి పోలునాయుడు, లక్ష్మిలను వివరణ కోరగా తమ పశువులు వారి పొలంలోకి మేతకు వెళ్లాయనే నెపంతో, తమపై నరసింహమూర్తి దాడికి పాల్పడ్డాడని తెలిపారు. ఆయనపై ఇది వరకు పలు తగాదాలు కోర్టులో నడుస్తున్నాయని చెప్పారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

చెక్కులు చూపుతున్న లబ్ధిదారులు, జనసేన నేత రాంకీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సిఫార్సు మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం రింగ్ రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ చేతుల మీదుగా అందజేశారు. అనకాపల్లి నియోజవర్గంలో బొడ్డేటి లక్ష్మికి రూ.21,974, కెల్లంపల్లి అప్పలరాజుకు రూ.20,524, మీసాల ఆదిలక్ష్మికు రూ.30,460, కోటి నర్సింగరావుకు రూ.70,918, రాపేట్ నాగేశ్వరరావుకు రూ.74,092, వరిగొండ వెంకట సన్యాసి సుభద్రరావుకు రూ.79,268, భీమిశెట్టి రూపకు రూ.20,000, బుద్ద త్రివేణి రూ.1,34,390, జెర్రిపోతుల రమణమ్మకు రూ.32,750, కాండ్రేగుల వెంకట్రావుకు రూ.1,16,289 చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఏ సమస్యలున్నా పార్టీ ఆఫీసులో సంప్రదించాలని ఈ సందర్భంగా రాంకీ సూచించారు.

సబ్బవరం : మండలంలోని ఆరిపాక పంచాయతీ శివారు చిన్నయాతపాలెం గ్రామానికి చెందిన దొడ్డి ప్రకాశరావుకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.60 వేలు చెక్కును ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-1 శరగడం యూనీస్ లక్ష్మిరాణి, జనసేన నేత శరగడం రాము పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

21 నుండి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 28 వరకు పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం జరిగే ఈ కౌన్సిలింగ్‌లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు పాలీసెట్ ర్యాంకు కార్డు, హాల్ టికెట్, నాలుగో తరగతి నుంచి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, పదో తరగతి మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఎన్‌సిసి, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, సిఏపి, వికలాంగ అభ్యర్థులు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఈనెల 25 నుంచి 29 వరకు ఆప్షన్ల ఎంపిక ఉంటుందని, జూలై 1న అంతకు ముందు ఇచ్చిన ఆప్షన్ల ఎంపికలు మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు 20వ తేదీన రిజిస్ట్రేషన్ ఫీజు ఓసి, బిసి అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250 చెల్లించాలన్నారు. విద్యార్థులకు సీట్ల కేటాయింపు జూలై మూడో తేదీ నాటికి పూర్తి అవుతుందన్నారు. మరింత సమాచారం కోసం 8142802794 నెంబర్‌కు ఫోన్ చేసిగాని, https://polycet.ap.gov.in లింకును సందర్శించి సంప్రదించాలని కోరారు.

గ్రామ పెద్దల సహకారంతో పాఠశాల అభివృద్ధి

ప్రజాశక్తి-మునగపాక : గ్రామ పెద్దలు, దాతల సహకారంతో పాఠశాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో బుధవారం పేరెంట్స్, గ్రామ పెద్దలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు పలువురు దాతలు ముందుకొచ్చినట్లు తెలిపారు. సమావేశానంతరం పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, చైర్మన్ సూర్యచంద్ర రామారావులను పెద్దలు ఘనంగా సత్కరించారు. సమావేశంలో గ్రామ పెద్దలు, దాతలు ఆర్ఇసిఎస్ పాలిటెక్నికల్ ప్రిన్సిపల్ బి.ఉమాశంకర్, బొడ్డేడ ప్రసాద్, పెంటకోట స్వామి సత్యనారాయణ, దిమ్మల అప్పారావు, టెక్కలి పరశురాం, పెంటకోట గిరిబాబు, దాడి ముసలి నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-మునగపాక : ఈనెల 20వ తేదీన పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నియోజకవర్గ సమన్వయకర్త తనకాల అనంతరావు పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలపై, కాంగ్రెస్ కార్యకర్తలకు పోరాట స్ఫూర్తి నింపేందుకు షర్మిల అనకాపల్లి విచ్చేస్తున్నారని తెలిపారు. 20న మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి రోటరీ కళ్యాణ మండపంలో జరుగు జిల్లా కాంగ్రెస్ సర్వసభ్య సమావేశానికి నియోజకవర్గం నుండి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంవిఆర్ రాహుల్, డిసిసి ప్రధాన కార్యదర్శి రావి రామ సత్యం, టౌన్ ఎలమంచిలి టౌన్ పార్టీ అధ్యక్షులు దొడ్డి రవి, పరవాడ రమణ పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీతో సమీకృత దాణా పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై పెల్లెట్ రూపంలో సమీకృత దాణా పంపిణీ కార్యక్రమం బుధవారం అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ అనీల్ కుమార్ మాట్లాడుతూ రూ.1100 విలువగల 50 కేజీల సమీకృత దాణా బస్తాను రూ.555కు పాడి రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, పంచదార్ల కన్నారావు, టిడిపి మండలాధ్యక్షుడు కర్రి బాబి, కూటమి నేతలు, ఏహెచ్ఏ వెంకట, గోపాలమిత్ర రమణ, హరి, పాల్గొన్నారు.

ఇకెవైసి మినహాయింపుతో రైతులకు ఊరట

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఈనెల 21వ తేదీన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు జమకు సంబంధించి రైతుల నుండి ఈకేవైసీ వెసులుబాటును ప్రభుత్వం కల్పించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 35 గ్రామపంచాయతీల్లో 13,749 రైతులు ఉండగా, వీరిలో 137 మంది బయోమెట్రిక్ ఈకేవైసీ చేయించాల్సి ఉందని మండల వ్యవసాయ అధికారి భాస్కరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5000, కేంద్ర ప్రభుత్వం రూ.2000 మొత్తం రూ.7000 జమ చేయడానికి ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి రైతుల నుండి ఆధార్ సంఖ్యతో ఈకేవైసీ ఈనెల 15వ తేదీ నుండి మండలంలోని గ్రామ రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ శాఖ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. కొన్నిసార్లు సర్వర్ మొరాయించడంతో రైతులు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్కసారి గంటల తరబడి సర్వర్ మొరాయిస్తుంది. ప్రభుత్వం రైతుల వివరాలను ఆటోమేటిగ్గా అప్డేట్ చేయడంతో ఈకేవైసీ నుంచి మినహాయింపును పొందారు. దీంతో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజాశక్తి 7
గురువారం 19 జూన్ 2025

దినచర్యలో యోగా భాగమవ్వాలి

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి-నక్కపల్లి:విశాఖలో జరిగే యోగా దినోత్సవంలో ప్రజలందరు పాల్గొని విజయవంతం చెయ్యాలని రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎస్ రాయవరం మండలంలో పర్యాటక ప్రాంతమైన రేవు పోలవరం సముద్ర తీరం వద్ద 2 వేల మందితో యోగా ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు ఆర్. శ్రీను, దవరసింగి రాంబాబు యోగాసనాలపై అవగాహన కల్పించారు.. హెూం మంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్, కాకినాడ సిటీ శాసనసభ్యులు వెంకటేశ్వర్లు(కొండబాబు) యోగాసనాలు వేసారు. ఈ సందర్భంగా హెూం మంత్రి అనిత మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశాఖపట్నంలో ఈ నెల 21 న జరిగే 11వ అంతర్జాతీయ యోగా ప్రదర్శన కార్యక్రమన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతు న్నారన్నారు.యోగా జీవితంలో ఒక భాగం అవ్వాలని హెూం మంత్రి పిలుపునిచ్చారు. రేవుపోలవరాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తామని హెూం మంత్రి అనిత అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సాయంత్రం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సుమారు 108 మంది విద్యార్థులకు యోగా ప్రోటోకాల్ ఆసనాలపై యోగా గురువు దవరసింగి రాంబాబు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో సీతారామరాజు, తహసిల్దార్ నరసింహమూర్తి, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ రఘు, ప్రిన్సిపల్ కే శ్రీదేవి పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. పెదబోదిగల్లం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం జయశ్రీ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనింగ్ ఆచార్యులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పాఠశాలల విద్యార్థులకు హెూంమంత్రి వంగలపూడి అనిత బహుమతులు అందజేశారు.

డైట్‌లో యోగాంధ్ర

అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ, డీడీఓ అధికారులు, 2000 మంది విద్యార్థులు, 100 మంది అధ్యాపకులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగాలో జాతీయస్థాయి విజేత పండూరి జయలక్ష్మి కొన్ని ఆసనాలు విద్యార్థులకు, నేర్పించారు. అనంతరం కళాశాల నుండి సబ్బవరం మూడు రోడ్ల సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, డాక్టర్ గోపాలకృష్ణ డాక్టర్ రత్నప్రకాష్, ఎంవి రామకృష్ణ, లక్ష్మీ, ఎం.గోవిందరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

సీతమ్మధార : 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' థీమ్‌తో ఈనెల 21న నిర్వహిస్తున్న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కార్యాలయంలో యోగా ఏర్పాట్లపై సమీక్షించారు. ఆర్‌కె.బీచ్ వేదికగా ఐదు లక్షల మంది పాల్గొనే యోగా దినోత్సవంలో ప్రధాని మోడీతోపాటు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా 326 కంపార్ట్‌మెంట్లు, రెండువేల సిసి కెమెరాల నిఘా, ఎల్‌ఇడి స్క్రీన్లు, యోగా మ్యాట్లు తదితర సౌకర్యాలపై చర్చించారు. కార్యక్రమంలో మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, వీఎంఆర్‌డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, నజీర్, ఉషా కిరణ్, సురేష్ బాబు, జెడిసిలు రాము , శివ ప్రసాద్ పాల్గొన్నారు.

గోపాలపట్నం: యోగాంధ్రను విజయవంతం చేయాలని, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు పిలుపునిచ్చారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 89, 90 వార్డుల కూటమి ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పార్టీ పరిశీలకులు పులపర్తి నాని, పరమేశ్వరరావు, చైతన్య, గౌడ కార్పొరేషన్ చైర్మన్ పాల్గొన్నారు.

అరిలోవ : యోగాంధ్రలో భాగంగా 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్ నూకాలమ్మ గుడి ప్రక్కన టైక్వాండ్ పిల్లలతో యోగ సాధన చేశారు . వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు పోత్రకొండ ధర్మారావు, టైక్వాండ్ కోచ్ ఆలీ, వార్డు కార్యదర్శి సురేష్, బాలస్వామి, రమణి, వడిసెల శ్రీను, ఆనందరావు పైడిరాజు గురుమూర్తి నగేష్ పాల్గొన్నారు.

విశాఖ సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే

ములగాడ : యోగాంధ్రను విజయవంతం చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు తెప్పల సతీష్‌కుమార్ కోరారు. శ్రీహరిపురంలో వీధి సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ ఏరియా శ్రామిక శక్తి లేబర్ కార్మిక అసోసియేషన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి నానాజీ, ప్రధాన కార్యదర్శి వసుంధర, ఈశ్వర్ పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు యోగాపై శ్రీనివాసరావు బుధవారం శిక్షణ ఇచ్చారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా పి శ్రీ వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు

ఆనందపురం : స్థానిక ఉన్నతపాఠశాల భవనంలో యోగా శిక్షకుడు తమ్మిన నర్సింగరావు ఆధ్వర్యంలో యోగాసనాల్లో శిక్షణ పొందుతున్నారు. నిరంతర యోగాసాధనకు మండల కేంద్రంలో పక్కా భవనంలో యోగా కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు.

ఆనందపురం: ఈనెల 21న యోగాదినోత్సవానికి ప్రజల తరలింపుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. యోగాంధ్ర యాప్ వినియోగం, ఒక్కో బస్సులో 50మందిని తరలింపునకు వీలుగా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ, పలుశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : యోగాంధ్ర కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం 35వ వార్డు కూటమి శ్రేణులు, జోనల్ కార్యాలయం, సచివాలయ సిబ్బంది, సిఒలతో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో సమావేశం నిర్వహించారు.

ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల సూచన మేరకు బుధవారం 18వ వార్డులోని జివిఎంసి ఎంవిపి పాఠశాల విద్యార్థులచే యోగా సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి సిద్ధార్థ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్నవిద్యార్థులు

మొక్కలు నాటివేత

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు గొలుగొండ మండలం ఏఎల్.పురం అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో వన సంరక్షణ మన సంరక్షణ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 400 మొక్కలను సోషల్ డిఎఫ్ఒ లక్ష్మణ్, రేంజర్ సుబ్బారావు, సెక్షన్ ఆఫీసర్ రాజు సమక్షంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రైవేటు ఒకేషనల్ కళాశాల, హైస్కూల్ పిల్లలతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎన్జీఎస్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అందుబాటులోకి నూతన డెట్టాల్ ఫ్రెష్ సోప్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పరిశుభ్రమైన ఉత్పత్తుల తయారీ బ్రాండ్‌లో ఒకటిగా ఉన్న డెట్టాల్, తాము ఎంతగానో ఇష్టపడే కోలోన్ ఫ్రెష్, లైఫ్ ఫ్రెష్ సోప్ రకాలలో 12 గంటల తాజాదనం పరిచయం చేసినట్టు రెకిట్ హెల్త్ విభాగ రీజనల్ మార్కెటింగ్ డైరెక్టర్ కనిక కల్రా తెలిపారు. పెరుగుతున్న వినియోగదారుల అవసరాన్ని తీర్చడానికి రూపొందించబడిందన్నారు.ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, డెట్టాల్ ఫ్రెష్ దుర్వాసన కలిగించే 99.9 శాతం క్రిములను తొలగించడం ద్వారా, రోజూ కలిగే అసౌకర్యాన్ని పరిష్కరిస్తోందని తెలిపారు. 12 గంటల వరకు తాజాగా ఉంచుతుందన్నారు.

గ్రామసభలు ఏర్పాటు

ప్రజాశక్తి-చింతపల్లి:పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ధాత్రి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్, పీఎం జన్మన్ కార్యక్రమాల శ్రేణిలో గ్రామ సభలు చింతపల్లి మండలంలో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం చౌడుపల్లి, కిటుములు, లోతుగడ్డ, కొమ్మంగి పంచాయతీల పరిధిలోని పకలు, చెరుకుంపాకలు, కొమ్మంగి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శుల సమన్వయంతో ఈ గ్రామ సభలు సాగాయి. ప్రజల సౌకర్యార్థం గ్రామ సభల సందర్భంగా ఆధార్ నమోదు, కొత్త రేషన్ కార్డు పంపిణీ, వైద్య శిబిరాలు, విద్యార్థుల కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు, జనధన్ ఖాతాల నమోదు, పీఎం కిసాన్ పథకాలపై ప్రత్యేక సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

మాట్లాడుతున్న థియేటర్ యజమాని డాక్టర్ అట్లూరి

శ్రీమెలోడి థియేటర్‌లో
బార్కో హెచ్‌డిఆర్ ప్రాజెక్టర్ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ మెలోడి థియేటర్‌లో కొత్త సినిమా టెక్నాలజీ హై డైనమిక్ రేంజ్ (హెచ్‌డిఆర్)ను బెల్జియం కేంద్రంగా ఉన్న ప్రొజెక్టర్ కంపెనీ బార్కో పరిచయం చేసింది. ఇది ఆసియాలో తొలి, ప్రపంచంలో ఏడవ ప్రొజెక్టర్ అని, ఈ ప్రొజెక్టర్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిన టిడిఐ (ది డిజిటల్ ఇన్‌ఫ్రా)తో బార్కో భాగస్వామ్యం చేసుకుందని, మే నెలలో పున్ననిర్మాణం అనంతరం తిరిగి ప్రారంభమైన శ్రీ మెలోడి థియేటర్‌లో మొదటిసారిగా ఈ ప్రొజెక్టర్‌ను అమర్చినట్టు థియేటర్ యజమాని డాక్టర్ అట్లూరి బుధవారం మీడియాకి తెలిపారు. చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్స్‌తో కలిసి బార్కో హెచ్‌డిఆర్ గ్రేడింగ్ ల్యాబ్ ఏర్పాటుచేసిందని, ఇప్పటికే హెచ్‌డిఆర్‌లో గ్రేడ్ చేసిన సినిమాలు ఉన్నాయని తెలిపారు. తెలుగులో హెచ్‌డిఆర్ గ్రేడ్ చేసిన కుబేరా, కూలీ మొదటి తెలుగు సినిమాలుగా విడుదల కానున్నాయని వివరించారు. ఈ టెక్నాలజీని అధికారికంగా ప్రారంభించి ప్రేక్షకుల కోసం అందుబాటులోకి బుధవారం తెచ్చినట్లు చెప్పారు.

రైతులకు విత్తనాల పంపిణీ

చీడికాడలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- చీడికాడ:రైతులకు అవసరమగు వివిధ రకాల విత్తనాలు సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని సర్పంచ్ సత్యవతి అన్నారు. మండలంలోని జైతవరం గ్రామంలో రైతు సేవా కేంద్రంలో గ్రామ సర్పంచ్ కోడూరు సత్యవతి, ఎంపీటీసీ పైలా ముత్యాలు నాయుడు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ సింధుజ రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోకల నాయుడు, కురచా రామారావు, కోడూరు అప్పలనాయుడు, గొర్లి శ్రీరామ్ మూర్తి,రెడ్డి తమ్ము నాయుడు, కురచ రామకృష్ణ, పశుసంవర్ధక శాఖ సహాయకులు మోర్తా శ్రీనివాసరావు, ఇంజనీర్ అసిస్టెంట్ త్రినాద్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్ నాయుడు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని జోగంపేట సచివాలయంలో ఆర్‌బికె కేంద్రంలో బుధవారం రైతులకు సబ్సిడిపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బికే సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో సాలికమల్లవరం పంచాయతీ గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డ మల్లేశ్వరరావు, జడ్పీ హైస్కూల్ చైర్మన్ గుడివాడ మురళీ, జోగంపేట పంచాయతీ ఉప సర్పంచ్ లాలం స్వామినాయుడు, నాయకులు జువ్వల దేవుడు, ఆర్‌బికె సిబ్బంది సత్యవేణి, సాలిక మల్లవరం పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గ్రామ సచివాలయం వద్ద ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసిన వరి విత్తనాలను గ్రామ వ్యవసాయ సహాయకులు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సచివాలయంలో 23 క్వింటాళ్ల ఆర్‌జిఎల్, బిపిటి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎన్‌టిఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఉల్లింగల రమేష్, తాళ్లపాలెం కూటమి నాయకులు గల్లా రాజు, కర్రి వెంకటసత్యనారాయణ, కర్రి గోవింద, కర్రి లోవరాజు, పుర్రె నారాయణరావు, రైతులు పాల్గొన్నారు..

విత్తనాలు ఇస్తున్న నాయకులు

ముఠా కార్మికులకు సమగ్రచట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రొంగల రాము డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ముఠా కార్మిక సంఘం సమావేశం ఎన్టీఆర్ స్టేడియంలో సంఘం అధ్యక్షుడు రుత్తల గోవింద్ అధ్యక్షతన జరిగింది. ముందుగా మోటూరు హనుమంతరావు చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఠా కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు రాము మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ముఠా కార్మికులు సేవలందిస్తున్నారన్నారు. రవాణా రంగం దేశానికి అత్యధిక ఆర్థిక వృద్ధిని సమకూర్చుతుందని, ఇది హమాలీ కార్మికుల కష్టమే అని ప్రభుత్వాలు గుర్తించాలని సూచించారు. ఇలాంటి రంగంలో దేశ వ్యాప్తంగా కోట్లాది మంది పని చేస్తున్నప్పటికీ వారి రక్షణకు, సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అమ్మేస్తుందని విమర్శించారు. ఈ సమస్యలపై జూలై 9 న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల పక్షాన ఉద్యమాలు నిర్మించడంలో వారి హక్కుల కోసం మోటూరి హనుమంతరావు చివరి వరకు పోరాడారని కొనియాడారు. అయన గొప్ప పాత్రికేయులని ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకు రావడానికి చైతన్య పరచడానికి పత్రికా రంగం లో పనిచేసారన్నారు. ఎన్నో పదవులు చేపట్టి చట్ట సభలలో ప్రజల గొంతుకైయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఐద్వా నాయకులు కెవి సూర్యప్రభ, ఎల్ గౌరి, ముఠా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.నానాజీ, అప్పారావు, రాము, సాంబ, పలువురు ముఠా కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోటూరు హనుమంతరావు చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, ముఠా కార్మికులు

మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్

బల్క్ డ్రగ్స్ పార్క్ పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు చేపడుతున్న పనులను బుధవారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పరిశీలించారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు రాజయ్యపేట తదితర గ్రామాల్లో సేకరించిన భూముల్లో పరిశ్రమల స్థాపన కోసం మౌలిక వసతులు కల్పనలో భాగంగా రోడ్ల నిర్మాణాలు తదితర పనులను చేపడుతున్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి, వేగంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించారు. కాగిత గుండా చేపడుతున్న కారిడార్ రోడ్డు పనులు, పెదబోదుగళ్లం లేఅవుట్ పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పనులకు సంబంధించి మ్యాపును పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ వీవి రమణ, తహసిల్దార్ నరసింహామూర్తి, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న నాయకులు, మహిళలు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని లింగంపేట టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు మారిశా రమణ అన్నారు. మండలంలో లింగంపేట గ్రామంలో బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుల ఫోటోలను సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసి తల్లికి వందనం లబ్ధిదారులు, కూటమి నాయకులు పాలాభిషేకం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో త్వరలోనే ప్రజలకు అందుతాయని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పరవాడ అప్పలనాయుడు,గెడ్డం సత్యనారాయణ, జనసేన మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాదు, గ్రామ ఉపసర్పంచ్ లంక సత్యనారాయణ, మిడతాన సూరిబాబు, మరిసా దేవుడు, మద్దపు కామునాయుడు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్ ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయ మండలం అరకు వ్యాలీ నుంచి లోతేరుకు నూతనంగా ఆర్టిసి బస్ సర్వీసును ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియారి దొన్నుదొర బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులను స్వయంగా చూశానని, తాను కూడా ఇబ్బంది పరిస్థితి ఎదుర్కొన్నానని ఆయన అన్నారు. అందుకే గిరిజన ప్రాంతంలో ఏపీఎస్ఆర్టీసీ సర్వీసులను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే పాడేరు నుంచి కందమామిడి, చీకు మద్దే నుంచి పాడేరుకు రెండు బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. తాజాగా లోతేరుకు మరో నూతన సర్వీసును ప్రారంభించామని ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమామహేశ్వరరావు, అరకులోయ మండల పార్టీ ప్రెసిడెంట్ లోక్నోయి మహదేవ్, పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, మాదల సర్పంచ్ వంతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

2028 నాటికి శతశాతం సేంద్రియ వ్యవసాయం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో 2028 నాటికి శత శాతం సేంద్రీయ వ్యవసాయం సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. రైతులకు అందించిన వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించాలన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాల పొందిన రైతులు, వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయాల పరిధిలో మెకనైజేషన్ ఆంతర్యం లేకుండా సర్వే చేసి ఎంత మేరకు వ్యవసాయ పరికరాలు అవసరమైవు తాయో ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఎంత మంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారు ? పంటలకు యూరియా, పొటాషియం, పురుగుల మందులు ఎంత మంది వినియోగిస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పరికరాలు రాయితీ పై ప్రభుత్వం అందిస్తుందని రైతులకు ఎలా తెలిసిందని ఆరా తీసారు. సేంద్రీయ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి చర్యలు చేపట్టమన్నారు. నీడ తోటలకు మద్ది, నేరేడు, పనస మొక్కలను రైతులకు ఉపాధి హామీ పథకంలో పంపిణీ చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్ మాట్లాడుతూ 351 మంది రైతులకు రూ.1.26 కోట్ల విలువైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసామన్నారు. 95 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, 29 మందికి ట్రాక్టర్లు, 59 మంది పవర్ టిల్లర్లు, 13 బ్రెష్ కట్టర్లు, 155 మందికి పవర్ వీడర్లను 50 శాతం రాయితీపై అందించడం జరిగిందన్నారు. అనంతరం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేసారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, అరకు వ్యాలీ, పాడేరు, వి.మోహనరావు, ఝాన్సీలక్ష్మి, ఎం.వి. శ్రీనివాస్, డిపిఎం ఎస్.జె.వి. రామ మోహనరావు, కుమార్, వ్యవసాయాధికారులు, గిరిజన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న అల్లూరి కలెక్టర్

'వెన్నుపోటు' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీడికాడ:ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడువి వెన్నుపోటు రాజకీయాలు అంటూ చీడికాడ మండలం వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు ఆరోపించారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలు, అరాచకాల పరిపాలనపై బుధవారం పార్టీ కన్వీనర్ రాజబాబు ఆధ్వర్యంలో వెన్నుపోటు అనే పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయమ్మ మాట్లాడుతూ, ఎన్నికలలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గాలికి వదిలేసి మోసపూరిత రాజకీయాలు చేస్తున్నారంటూ ఆరోపించారు కూటమి పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో 50 సంవత్సరములకు పింఛను, ప్రతి మహిళకు నెలకు 1500, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి 3000 ఇస్తానని చెప్పి అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, మండల పరిషత్ అధ్యక్షులు కూరచా జయమ్మ నారాయణమూర్తి, యూత్ అధ్యక్షులు గొల్లవిల్లి స్వామినాయుడు, ఈర్లి చైతన్య, సలాది గంగేశ్వు, శరగడం సన్యాసినాయుడు, కొల్లి శ్రీనివాసరావు, పి రామ్ కుమార్, ఆర్లి నాయుడు, గాడి దేవి నాయుడు, గంట మచ్చిరాజు, ధర్మిశెట్టి కొండబాబు, ఎంపిటీసీలు ఈర్లి నాయుడు బాబు, మాజీ సర్పంచులు, పరవాడ అప్పారావు, పరవాడ మహేష్, పరవాడ రామారావు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు. ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాధవధార	: 9490099675
పాడేరు	: 9490099142		
రంపచోడవరం	: 9440165617		